## *హనుమంతుడు*

*మనోవాక్కాయకర్మలను ఏకముగా ఆచరించినవాడు హనుమంతుడు. అతడు పెద్ద పండితుడు. నవవిధ వ్యాకరణములను బాగా తెలుసుకున్నవాడు. నాలుగు వేదములను, ఆరుశాస్త్రములను పూర్తిగా తెలుసుకొన్న మహా విద్వాంసుడు. పైశాచిక, గజకర్ణగోకర్ణ విద్యలందు మహా ప్రవీణుడు. కృష్ణుడు చెప్పిన గీతను పైశాచిక భాషలో ప్రప్రథమంగా రచించినవాడు హనుమంతుడు. 'పండితాః సమదర్శినః' అన్నట్లు హనుమంతునిలో విద్యాగర్వము లేదు. వినయసంపన్నుడు. పాండిత్యమునకు సమదృష్టి కూడను యేకము కావటంచేత హనుమంతుడు మహా పవిత్రమైన మార్గమునందు ప్రవేశించాడు. అందరిలోనూ ప్రకాశించుచున్న రామతత్త్వమును సందర్శించి సంతోషపడేవాడు. ఏ పదార్థము ముట్టినప్పటికి ఆ పదార్థములో రామనామము ఉన్నదా లేదా అని పరీక్షించేవాడు. రామనామము లేనివన్నీ రాళ్లతో సమానమనుకున్నాడు. తన దేహమందున్న రోమరోమము రామనామమునే తలుస్తూ వచ్చింది. మనము కష్టసమయంలోనే దైవచింతన చేయము. సుఖసమయమునందు కూడా దైవాన్ని మరచిపోతుంటాము. సుఖదుఃఖ సమయముల రెండింటియందు సమత్వాన్ని వహించిన మహాబలవంతుడు ఈ హనుమంతుడు. అహంకారము లేని గుణవంతుడు. మమకారము త్యజించిన మహనీయుడు. కనుకనే, రాములు ఇతనిని, 'శాంతుడు, గుణవంతుడు, బలవంతుడు హనుమంతుడు' అన్నాడు.*

## నిదానం ప్రధానం

ఋష్యమూక పర్వతప్రాంతమున రామలక్ష్మణులు సీతాన్వేషణ నిమిత్తమై వస్తున్నటువంటి దృశ్యమును ఋష్యమూక పర్వతమునుంచి సుగ్రీవ హనుమాదులు చూచారు. వారు వాలియొక్క దూతలుగా ఉండవచ్చుననియు, తనకేదో అపకారము చేయుటకై వచ్చుచున్న వారలనియు సుగ్రీవుడు భావించి, తాను అనేకరకములుగా బాధలకు గురైనాడు. అప్పుడు గుణవంతుడు, మహాశాంతుడును అయిన హనుమంతుడు నిదానించి చూచాడు. అతడు'haste makes waste. waste makes worry. so do not be in a hurry' అన్న తత్త్వమును విశ్వసించినవాడు కనుక, 'సుగ్రీవా! నీవేమీ తొందరపడవలదు. బాధపడవలదు. వారెవరో నేను తెలుసుకొని వస్తాను. ఆ తొందర మంచిది కాదు, ఊహలు పనికి రావు. సత్యము తెలుసుకొన్న మంచిది'ని అతనికి శాంతవచనములు చెప్పి, తాను నెమ్మదిగా రామలక్ష్మణుల దగ్గరకు వచ్చాడు. 'అయ్యా! నేను సుగ్రీవుని భటుడను. తమరెవరో, ఈ అరణ్యములో ఏవిధముగా ప్రవేశించినారో, తమ రాకకు కారణమేమో కొంచెము తెలుపాలి' అని వినయ భయ విశ్వాసములతో, సుస్పష్ట భాషలో, సుందర వాక్యములలో వారిని ప్రశ్నించాడు. రాముడు, అతని ప్రశ్నలన్నింటికిని శాంతముగా సమాధానములు చెప్పటంచేత, అతడు సంతృప్తుడై, 'అయ్యా! మీ యిద్దరినీ సుగ్రీవుని దగ్గరకు తీసుకొనిపోదును. నా భుజములపైన ఎక్కికూర్చోండి' అని, ఎక్కుటకు వీలుగా శరీరమును కుచించినాడు. రామలక్ష్మణులు సుందరమందహాసకటాక్షములతో హనుమంతుని ఒకమారు వీక్షించి, అతని భుజములపై ఎక్కి కూర్చున్నారు. వారి దర్శనము వలన పాపనాశనమైనది. స్పర్శనము వలన కర్మవిమోచనము లభించినది. వారితో జరిగిన సంభాషణము వలన సంకటవిమోచనమైనది. భగవంతుని దివ్యదేహము తన దేహమును సోకిన తక్షణమే ఆయన హృదయమునుంచి సద్భావములు, సచ్చింతనలు ఉప్పొంగినవి. ఆయన చిత్తము పవిత్రమైనది. అతడు వారిని తీసుకువెడుతూ, తనలో,' మా సుగ్రీవునికి సరియైన మిత్రులు చిక్కారు. ఈ పవిత్రమూర్తుల స్నేహమువల్ల అతని మనోభీష్టము తప్పక నెరవేరుతుంది' అనుకొంటూ వెళ్ళుతున్నాడు. 'యద్భావం తద్భవతి' ఈ భక్తునియొక్క హృదయము అతిపవిత్రమైనది కనుకనే, భగవంతుని చిత్తము కూడను దానికి అద్దమువలె ప్రతిబింబిస్తూ వస్తున్నాది. తక్షణమే అతని భుజముపైనున్న రాముడు, లక్ష్మణునితో,' ఇలాంటి మిత్రుడు మనకు లభించటం, మన కార్యసాఫల్యమునకు శుభసూచన' అని సైగగా అన్నాడు. రామునికి, సుగ్రీవునికి సరైన మైత్రీభావము కల్గినది. తన మనోరథము ఇతని ద్వారా నెరవేరునని ఇద్దరికీ ధృడమైనది.

**దూతలు**

దూతలలో మూడు రకములవారుంటారు. కొంతమంది ప్రభు ఆజ్ఞననుసరించక, తద్విరుద్ధముగా చేసి, విరోధ చర్యలలో ప్రవేశించి అపచారము చేయుదురు. మరికొందరు, ప్రభు ఆనతి ఎంతవరకో అంతమాత్రమే అనుసరింతురు. అయితే, మూడవ రకము వారు ఉత్తమోత్తములు. వారు ప్రభువుయొక్క ఆజ్ఞను మాత్రంకాదు, వారి యింగితమును తెలుసుకొని, శ్రద్ధాభక్తులతో, శక్తివంచన లేకుండా కార్యక్షేత్రమందుండి విజయమును సాధించిన తరువాత మాత్రమే మరి ప్రభు దర్శనమునకాశించువారు. హనుమంతుడు ఉత్తమోత్తమ దాసుడు. రామచింత తప్ప ఆయనకన్యచింత లేదు. రాముని ఆశయాలను గుర్తెరిగినవాడు. ఆ అడుగు జాడలలోనే సంచరించువాడు. హనుమంతుడు గొప్ప తెలివైనవాడైనప్పటికి భగవంతుని విషయంలో మంచి చెడ్డ అనే విచారణకేమాత్రము అవకాశమిచ్చేవాడు కాదు. రాముడు యేది చెప్పినా తక్షణమే చేసేవాడు. 'హనుమాన్! నీవు సముద్రాన్ని దాటి లంకకు వెళ్ళి సీత ఉన్నదో లేదో తెలుసుకొని రమ్ము' అన్నాడు రాముడు. రామాజ్ఞ దొరకిన తక్షణమే, ఒక పవిత్రశక్తి తనలో ప్రవేశించినట్లైనది. హనుమంతునికి దేహము, మనస్సు రెండూ దివ్యత్వముచే నిండినవి. రామాజ్ఞ ప్రకారం హనుమంతుడు సముద్రాన్ని దాటటానికి సంసిద్ధమైనాడు. కాని, జాంబవంతుడు, అంగదుడు మున్నగువారందరూ, 'ఇంత పెద్ద సముద్రాన్ని నీవు దాటగలవా?' అని ప్రశ్నించారు. 'రామాజ్ఞను శిరసావహించటమే నా కర్తవ్యం. నీవు లంకకు వెళ్ళిరా అని నాకు చెప్పాడు. కనుక, నేను పోతున్నాను. సముద్రాన్ని దాటే శక్తి తానే యిస్తాడు. లంకకు వెళ్లమని చెప్పినవాడు శక్తినిమాత్రం యివ్వడా! అతని ఆజ్ఞను శిరసా వహిస్తున్నాను' అన్నాడు. ఇదే విజయానికి కారణం. సందేహాలకు అవకాశము యివ్వలేదు. నూరు మైళ్ళ విస్తీర్ణముగల సముద్రమును ఆశ్చర్యకరమైన రీతిన దాటుటకు సాధ్యమైనది. మార్గమధ్యమున ఒక పర్వతము లేచి ఆతిథ్య మందించినా స్వీకరించలేదు. సురస అనే రాక్షసి బెదరించినా భయపడలేదు. ఆజ్ఞయే శరణు అని రామబాణము వలె లంకను చేరినాడు.

**దాసోహం కోసలేంద్రస్య**

హనుమంతుడు లంకలో ప్రవేశించినప్పుడు రాక్షసులందరూ చుట్టుముట్టారు. అంతకుముందు యేనాడూ కోతిని చూసియుండలేదు. కోతులు వారికి తెలియదు. ఈ వింతరూపము చూసి స్త్రీలు, పురుషులు, పిల్లలు అందరు గుమిగూడారు. 'ఎవరు నీవు? ఎక్కడనుండి వచ్చావు? ఎవరు పంపారు నిన్ను? ఈ లంకలో ఎట్లా ప్రవేశించావు?' అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఇక్కడ హనుమంతుని పవిత్రమైన శాంతమును మనం గమనించాలి. 'దాసోహం కోసలేంద్రస్య! నేను రామచంద్రుని దాసుడను' అన్నాడు. అతడు తలచుకుంటే ఒక చేతితో లంకనంతటినీ నలిపివేయగలడు. అంతటి శక్తి ఉన్నప్పటికీ పరమశాంతముతో, వినయవిధేయతలతో జవాబిచ్చాడు.

హనుమంతునకు భక్తితోపాటు ఆత్మవిశ్వాసము కూడను కలదు. ఆత్మవిశ్వాసమే లేకుండిన, ఎంత భక్తి ఉండిననూ యేమీ ప్రయోజనముండదు. అట్లే ఆత్మవిశ్వాసము ఉండికూడను, భక్తి లేకపోతే ప్రయోజనము లేదు. భక్తి, ఆత్మవిశ్వాసము ఈ రెండూ నెగిటివ్, పోజిటివ్ వంటివి. రెండునూ ఏకమైనప్పుడే ఏదైనా ఒక పవిత్రమైన కార్యమును సాధించుటకు వీలవుతుంది. అతడు దివ్యమైన భావమును తన హృదయమునందుంచుకొనటంచేత, సర్వత్రా రామదర్శనమే చేయగలుగుతూ వచ్చాడు. ఏదైనా ఆర్డరు చేస్తే, యిది నేను చేయగలనా, దీనికి తగిన శక్తిసామర్థ్యములు నాకున్నవా అనేటువంటి విచారణకు యేమాత్రమును తాను అవకాశమిచ్చేవాడు కాదు. రామునియొక్క ఆజ్ఞలే, నాకు కావలసిన శక్తిసామర్థ్యములనిచ్చి నా ప్రయత్నములను జయప్రదము గావింపగలవనే గాఢవిశ్వాసము హనుమంతునిది.

సత్వరజస్తమో గుణములలో రజోగుణము చాలా ప్రమాదకరము. రజోగుణముయొక్క కుమారుడు కామము! కామము హృదయమందు చేరిన సర్వసద్గుణములనూ హతమార్చును. రావణుడు దానివలన తన

తపశ్శక్తిని సంపూర్ణముగా కోల్పోయి కులనాశనమునే తెచ్చుకొన్నాడు. రజోగుణము యొక్క రెండవ కుమారుడు క్రోధము. ఈయన మానవుడు సంగ్రహించి సంపాదించుకొన్న జ్ఞానపాత్రను అపహరించి పగులగొట్టును. మానవత్వమునే ధ్వంసముచేసి, దానవత్వమును అభివృద్ధి చేయును. కామమును అగ్నితో పోల్చుదురు. అగ్నికి అనలం అనేది ఒక పేరు. అలం అంటే చాలు అని అర్థము. అగ్నికి చాలు అనేది లేదు. అనలం ఎంతవేసిననూ అగ్నియొక్క ఆకలి పెరుగునేగానీ శమింపదు. అట్లనే ఇంద్రియానుభవములు ఎంత అనుభవించిననూ అలం అనేది లేదు.

**అంతఃపురములో అన్వేషణ**

హనుమంతునిలో కామమనేదే లేదు. కామమునకు గురికాక శ్రీరాముని అనుగ్రహమును సంపాదించినాడు. హృదయమును చల్లార్చుటకు ఆయనకు రామచింతన చాలును. హనుమంతుడు సముద్రాన్ని దాటి లంకకు చేరుకున్నాడు. హనుమంతుడు గొప్పబ్రహ్మచారి. స్థిరచిత్తుడు. అచంచలహృదయుడు. అతడు సీతకోసం అంతఃపురములోని పడక గదులను కూడా వెతుకక తప్పలేదు. అయితే బ్రహ్మచారి అయినవాడు ఈవిధంగా అంతఃపురములోనికి వెళ్ళవచ్చునా అని చిల్లరబుద్ధిగలవారు ప్రశ్నించవచ్చు. ఎక్కడైతేనేమి, అతడు సీతను దృష్టిలో పెట్టుకొని వెతికాడేగానీ, పరస్త్రీలను దుర్బుద్ధితో చూడలేదు. అతనికి ఎక్కడ చూచినా తప్పత్రాగి పడిపోయిన రాక్షసస్త్రీలే కనిపించారు. వారి శరీరాలే వారి స్వాధీనంలో లేవు. అయితే ఒక గదిలో గాఢమైన నిద్రలో మునిగి ఉన్న ఒక అందమైన స్త్రీని చూశాడు. 'ఈమెయే సీత కావచ్చును' అని అనుకున్నాడు. మరు క్షణంలోనే 'ఛీ! సీత రాముని వీడి ఇలాంటి పడక గదిలో పడుకుంటుందా? కనుక, ఈమె సీత కాదు' అని గుర్తించాడు. అతనిలో ఒకవిధమైన విరక్తి కలిగింది. తిరిగి సముద్రం దగ్గరకు వచ్చాడు. ఒక గుట్టపైనున్న వృక్షము నెక్కాడు. 'నేను సీతను గురించిన సమాచారము తెలుసుకోకుండా తిరిగి వెడితే రామునికేమని జవాబు చెప్పాలి? రామాజ్ఞను నెరవేర్చ లేకపోయిన తరువాత ఇంక నా బ్రతుకెందుకు?' అని సముద్రంలో దూకి ఆత్మహత్య చేసుకోటానికి సిద్ధమయ్యాడు. ఇంతలో అతనికి దూరంగా యేదో పెద్ద వనం కనిపించింది. 'నేనా వనము చూడలేదే' అనుకొని మళ్ళీ అక్కడికి పరుగెత్తి వెళ్ళాడు.

**అశోకవనమున సీత**

అది అశోకవనము. అక్కడ శింశుపా వృక్షము క్రింద కూర్చొనియున్న సీతను చూచాడు. అయితే అతడు లంకకు రాకముందు సీతనెప్పుడూ చూసియుండలేదు. కనుక, ఆమె సీత అవునో కాదో అని సందేహము కలిగింది. నెమ్మదిగా ఆ చెట్టునెక్కి రామకథను గానంచేస్తూ వచ్చాడు. సీత పైకి చూచింది. కన్నీటి ధారలు కార్చుతున్నది. అప్పుడు ఆమె చుట్టూ ఉన్న రాక్షసులలో విభీషణుని భార్యయైన సరమ, కుమార్తెలైన అజటా త్రిజటలు ఉన్నారు. ఈ ముగ్గురే సీతకు ధైర్యం చెబుతున్నారు. ఈ సమయాన్ని చూసుకొని హనుమంతుడు రాముని దగ్గరనుండి తెచ్చిన ఉంగరాన్ని సీత ముందు పడవేశాడు. సీత ఆ ఉంగరాన్ని చూసింది. పట్టలేని ఆనందముతో, ' నాయనా! నీవు నిజముగా రాముని బంటువేనా? లేక ఇది కూడా రాక్షస మాయా? లోగడ రాక్షసులు అనేక రూపాలను ధరించటం చూసాను. కనుక, నిన్ను నమ్మలేకపోతున్నాను. పూర్వం నేను నిన్నెప్పుడూ చూడలేదు. నీవుకూడా నన్ను చూడలేదు. మరి నిన్ను నిజంగా రామచంద్రుడే పంపించాడనటానికి ఆధారమేమిటి? ఈ ఉంగరం కూడా కృత్రిమమైనది కావచ్చు' అన్నది. అప్పుడు హనుమంతుడు, 'తల్లీ! రాముడు నా హృదయమందే ప్రతిష్ఠింపబడి ఉన్నాడు. కావాలంటే యిదిగో చూడు' అన్నాడు. అతని హృదయాన్ని చూస్తూ చూస్తూ సీత తన్మయత్వంతో పడిపోయింది. ఆమెకు అతని హృదయంలో శ్రీరామచంద్రుడు కనిపించాడు. సీత యెంతో ఆనందించి తన గుర్తుగా రాముని కివ్వమని శిరోరత్నమును యిచ్చింది. దానిని తీసుకొని హనుమంతుడు బయలుదేరాడు.

**రావణుని రా కొట్టినవాడు**

సీతను చూచిన ఆనందంలో వనంలోని కొమ్మలను, రెమ్మలను త్రుంచివేస్తున్నాడు. అడ్డువచ్చిన రాక్షసులను అంతం చేస్తున్నాడు. చిట్టచివరికి ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రంతో హనుమంతుని బంధించి రావణుని దర్బారుకు తీసుకు వెళ్ళాడు. దుష్టుడు, దుర్మార్గుడు అయిన రావణుడు పెద్ద సింహాసనంలో ఉన్నత స్థానంలో కూర్చుంటే, సద్గుణవంతుడను, అందులోను రామభక్తుడనైన నేను క్రింద నిలబడటమేమని భావించి హనుమంతుడు తన తోకను బాగా పెంచి రావణుని సింహాసనము కంటె ఎత్తైన చుట్టగా చుట్టి దానిపైన కూర్చున్నాడు. అప్పుడు రావణుడు, 'కోతి జాతివి నీవు, వనమెల్ల జెరచితివి, నిన్నెవడు బంపించెరా?' అని ప్రశ్నించాడు. 'నీ చెల్లెలి ముక్కు చెవులు కోసి పంపిన రాచదొర నను బంపెరా!' అని జవాబిచ్చాడు. రావణునికి కోపం వచ్చింది. 'ఏ రాజులూ నన్ను ఏమి'రా' అనలేదు, నోరుమూయించేను రా' అన్నాడు. 'ఎవ్వరూ నిన్ను యింతవరకు 'రా' అని అనలేదేమోకాని, నేను రామబంటును కనుక, నిన్ను 'రా' అనే అధికారం నాకు ఉన్నది' అని జవాబిచ్చాడు హనుమంతుడు.

రావణునికి మాతృదేవియొక్క తత్త్వాన్ని బోధిస్తున్నాడు.

లోకమునకు తల్లిరా ఈ సీతమ్మ నీకు చూడగ తల్లేరా
లోకమాతను దెచ్చి యిప్పుడు, పాతకమునొడిగట్టుకొంటివి
ఏక శరమున నీదు శిరములు ఏకమారుగ ద్రుంచు రాముడు
బుద్ధి చెప్పెద రావణా! ఈ లంకనీకింక లేదుర దుర్గుణా.
సీతతొ సంభాషించితి రాముల ముద్దుటుంగర మందించితి
పాతకుడని వనము గాచిన బడుగు రాక్షసుల చంపి నా
కోతినంచు నాతో పోరి రాచపురికాయు రాక్షసులు
బుద్ధి చెప్పెద రావణా! ఈ లంకనీకింక లేదుర దుర్గుణా.

కట్టకడపటికి ఒకటి మాత్రమే చెప్పాడు.

నీ పది తలలు ఊడేతీరు నీవిప్పుడు చేసె దర్బారు చూడు
యిదికదా నేను చూడవలెనని యింద్రజిత్తు చేత చిక్కితి
పదే పదే నీకేల చెప్పుదు ప్రాణములు నీ సొమ్ము కాదుర
బుద్ధి చెప్పెద రావణా! ఈ లంకనీకింక లేదుర దుర్గుణా.

ప్రాణము నీ చేతిలో లేదు. పరమాత్మ చేతిలో ఉంటున్నాది. నేటికైనా గుర్తించుకొని పరమాత్ముని ప్రార్థించు.

**లంకా దహనం**

రావణునిలో కొంత భయం యేర్పడింది. ఒక్క కోతికే యింత ధైర్యము, శక్తిసామర్థ్యములుంటే రాముని సైన్యంలో యింకా ఎంత గొప్పవారున్నారో అని అధైర్యం కలిగింది. 'చేతకానివానికి చేష్టలు జాస్తి' అన్నట్టుగా, రావణుడు హనుమంతుని తోకకు నిప్పంటించమని ఆజ్ఞాపించాడు. రాక్షసులు పాతబట్టలు తెచ్చారు. తోకకు చుట్టారు. నూనె పోసి నిప్పంటించారు.

'మేలని తెలిసినదా ఈపని, నీకు కీడని తెలియలేదా!
వాలము గాల్చితిరి, మంచి ఆలయములు, వజ్రాలమేడలు
నీలి వర్ణము చేసి నీ పురి, నెమ్మదిగ నే పోయి వచ్చెద
బుద్ధిచెప్పెద రావణా! ఈ లంక నీకింక లేదుర దుర్గుణా!
లోకమాతను తెచ్చి ఇప్పుడు పాతకము ఒడిగట్టుకొంటివి
ఏకశరమున నీదుశిరము ననేకమారులు తుంచు రాముడు

బుద్ధిచెప్పెద రావణా! ఈ లంక నీకింక లేదుర దుర్గుణా!

వెంటనే హనుమంతుడు తన తోకను చల్లార్చుకోటానికి ఎగిరాడు. ఒక యింటి మీదనుండి మరొక యింటి మీదకి దూకాడు. కట్టకడపటికి సముద్రంలో దూకి తన తోకమంటను చల్లార్చుకున్నాడు. అక్కడి నుండి చూస్తే లంకంతా మంటల్లో కనిపించింది. అప్పుడు సీత గుర్తుకు వచ్చింది. 'అయ్యో! రామాజ్ఞను ఉల్లంఘించి రావణునిపై కోపంతో చేసిన పనివల్ల సీతకేమైనా ప్రమాదం జరిగిందేమో!' అని చింతించి తిరిగి అశోకవనానికి పరుగెత్తాడు. అక్కడ సీత క్షేమంగా ఉన్నది. ఇంక క్షణమైనా అక్కడ నిలువ దలచుకోలేదు. ఎందుకంటే తాను లంకకు సీతాన్వేషణ కోసం వచ్చాడు. ఆమెను చూసాడు. ఇంక, ఈ వార్తను ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా రామునికందించాలని భావించాడు. దారిలో ఒక పండైనా తినలేదు. నీటిని కూడా ముట్టలేదు. ఒక్క ఉదుటున సముద్రం దాటి శ్రీరాముని వద్దకు వెళ్లి సీత క్షేమాన్ని విన్నవించాడు. ఆవిధముగా రామాజ్ఞనిమిత్తమై తన జీవితమునే అర్పితము గావించుకొని, రాముని ఆజ్ఞను అనుసరించు సమయమున గుణదోషములను విచారించుకొని, పవిత్ర మార్గమున ప్రవర్తించిన నిశ్చలచిత్తుడు, నిస్వార్థపరుడు హనుమంతుడు.

**చంద్రునిలో మచ్చ**

హనుమంతుని భక్తికి ఒక చిన్న నిదర్శనము. హనుమంతుడు లంకకు వెళ్ళి, సీతమ్మవారి వార్తలు తెచ్చిన తర్వాత, రామలక్ష్మణులు వానరబలగముతో లంకకు ప్రయాణము కట్టి, ఒకనాటి రాత్రి సముద్రముగట్టునచేరి అక్కడ నివసించినారు. హనుమంతుడు, జాంబవంతుడు, సుగ్రీవుడు, అంగదుడు, నలుడు మొదలగు నాయకులును, లెక్కకుమించియున్న వానరవీరులును రామలక్ష్మణులచుట్టూ చేరియున్నారు. ఆనాడు పూర్ణిమ. చంద్రునియొక్క ప్రకాశము చల్లగా, తెల్లగా సర్వప్రపంచమును, సర్వులహృదయములను ప్రకాశి ంపచేస్తూ వచ్చింది. తెల్లవారగనే సముద్రము దాటాలి, లంకకు వెళ్లాలి, అన్న ఆలోచనలో ఉండటంచేత, ఆరాత్రి ఎవ్వరికీ నిద్రపట్టలేదు. రామలక్ష్మణులు వానరులకు ఉత్సాహమునిచ్చే నిమిత్తమై ఉల్లాసముగా మాట్లాడుతూ వస్తున్నారు. నడచి అలసిపోవటంచేత లక్ష్మణుని తొడపైన తలపెట్టి పరుండి, ఆకాశమును చూస్తూ, విశ్రాంతి తీసుకుంటున్న రాముడు,' లక్ష్మణా! చంద్రునిలోనున్న ఆ నల్లని మచ్చ యేమిటి?' అని అడిగాడు. అట్లనే సుగ్రీవాదులను ప్రశ్నించాడు. ఒకరు 'అది భూమియొక్క ఛాయ' అన్నారు. ఇంకొకరు,' భూమినుండి పైకెగిరిపోయిన మట్టి, దట్టముగా అంటుకొని ఆవిధమైన నల్లని మచ్చగా కనిపిస్తున్నాది' అన్నారు. ఈవిధముగా ఎవరికితోచినట్లువారు చెప్తూతూ వచ్చారు. కాని, హనుమంతుడు మాత్రము పల్లెత్తి పలుకలేదు. అప్పుడు రాముడు, అతని పవిత్రతత్త్వము చుట్టూ ఉన్న వానరులకందరికిని ఆదర్శముగా అందించే నిమిత్తమై, 'హనుమాన్! నీ అభిప్రాయమేమిటి?' అని ప్రశ్నించాడు. 'హనుమాన్' అన్న రామచంద్రుని పిలుపు వినబడగానే అతని హృదయము ద్రవించినది. ఆనందము ఉప్పొంగి బాష్పరూపమున ప్రవహించినది. అతడు ఆనందబాష్పములు కార్చుకుంటూ, 'రామచంద్రా! నీవు లక్ష్మణుని తొడపైన పండుకొని ఆకాశంవైపు చూస్తూ ఉండటంచేత నీ ముఖముయొక్క ప్రతిబింబమే స్వచ్ఛమైన చంద్రుడనే అద్దములో కనిపిస్తున్నాది. అంతేగాని అది మరేమీకాదు' అన్నాడు. అతని చిత్తములో సర్వకాలసర్వావస్థలయందును, రామచింతనయే తప్ప అన్యచింతన అణుమాత్రమైననూ ఉండదు. అతడు దేనిని చూచినా, దేనిని పల్కినా, దేని దగ్గరకు పోయినా అంతా రామమయమే! కనుకనే, చంద్రునిలోని మచ్చకూడా అతనికి రామునియొక్క ప్రతిబింబముగానే కనబడింది. ఆవిధంగా శ్రీరాముడు హనుమంతుని హృదయములోని అనన్య భక్తిని వానరులకందరికిని ఆదర్శముగా అందించాడు. హనుమంతుడు యేది చూచినా దానిలో రామదర్శనమే కలుగును. రోమరోమమందు రామనామమే పలుకును. హనుమంతుడు కోతిజాతికి చెందినటువంటివాడే కాని, అతడు చంచల బుద్ధికి పెట్టినపేరు, పుట్టినయిల్లు అని మనం భావించటము పొరపాటు. అది అవమానకరము. ఇతడు సాక్షాత్ ఈశ్వరాంశ సంభూతుడు. కనుక, అతనిలో దివ్యత్వమున్నది. ఎట్టి సందియము లేదు.

**రామనామం**

హనుమంతునికి వివాహమైంది. సువర్చల ఆయన భార్య. అయినా ఆయన శుద్ధ బ్రహ్మచారియే. అనగా నిరంతరమూ రామచింతనయందే ఉండేవాడు. ఎప్పుడూ భగవంతుని గురించే ఆలోచన. అంటే నిరంతరమూ బ్రహ్మచర్యమే చేస్తూ ఉండేవాడు. రామపట్టాభిషేక సమయంలో రాముడు అందరికి రకరకములైన బహుమతులు యిచ్చాడు. అప్పుడు సర్వకాలసర్వావస్థలలోనూ తమకు సేవ చేసే హనుమంతునికి ఒక్క బహుమతి కూడా యీయలేదే అని సీత బాధపడింది. 'అతనికి యివ్వదగ్గ బహుమానం నా దగ్గర ఒక్కటికూడా లేదు. నన్ను నేనే యిచ్చుకుంటాను' అన్నాడు రాముడు. వెళ్ళి హనుమంతుని గాఢముగా కౌగలించుకున్నాడు. అప్పుడు సీత, 'కేవలం భౌతికంగా స్పర్శ అందిస్తే అది బహుమానం ఎలా అవుతుంది?' అని తన తండ్రి జనకమహారాజు తనకిచ్చిన ముత్యాల హారము తీసి హనుమంతునికి యిచ్చింది.

రఘుపతి కార్యము యీడేర్చిన కపిరాజశిఖామణి నీవయ్యా
అదనున పురిగొని జగముల వెలసిన హనుమద్గురుడవు నీవయ్యా
పరిపరి లంకాపురమును జొచ్చిన పురహర శౌర్యము నీదయ్యా
పరిపరి విధముల జానకి వెదకిన అమిత పరాక్రముడవీవయ్యా!

'రామ కార్యమును నెరవేర్చిన కపిరాజశిఖామణి నీవు. నీవే లేకపోతే రామకార్యము నెరవేర్చేవారెవరు?' అని ఆమె ఆ మాల అందించింది. అందరూ చూస్తున్నారు. ఆ ముత్యాలహారాన్ని తుంచేస్తున్నాడు హనుమంతుడు. ఒక్కొక్క ముత్యాన్ని కొరికి పారవేస్తున్నాడు. సీతకు అంతరార్థము తెలుసు. కానీ, మిగిలిన వారికి బాహ్యమైన క్రియయే కనిపిస్తున్నాది. 'కోతిజాతి బుద్ధులు పోతాయా? విలువైన ముత్యాలను కొరికి పారవేస్తున్నాడే' అనుకున్నారు. వీరందరికి సరైన పాఠము నేర్పాలని సీత హనుమంతుని అడిగింది,' హనుమంతా! విలువైన ముత్యాలను ఎందుకు కొరుకుతున్నావు? కొరకటం చెవిదగ్గర పెట్టుకోటం, పారవేయటం, ఏమిటిది?' 'అమ్మా! ఏ ముత్యములోనైనా రామనామము ఉన్నదేమోనని చూస్తున్నాను' అన్నాడు. 'పిచ్చివాడా! ముత్యములో రామనామము ఉంటుందా?' అన్నది సీత. 'రామనామము లేని ముత్యములు నాకు రాళ్లతో సమానము. వజ్రములైనా, మణులైనా, మాణిక్యములైనా, మరకతములైనా సరే రామనామము లేకపోతే నాకు మట్టితో సమానమే. సర్వత్రా రామనామమే కావాలి. రామనామము లేనిది నా దేహములో అణుమాత్రము లేదు' అని తన చేతిపైనగల ఒక వెంట్రుకను తీసి రాముని చెవి దగ్గర పెట్టాడు. ఆ వెంట్రుక కూడా రామ్ రామ్ రామ్ అని శబ్దము చేయసాగింది. అతని దేహమంతా రామనామముతో నిండిపోయింది. సర్వకాలములందు రామచింతన చేయటం వలన హనుమంతుని బ్రహ్మచారి అన్నారు. 'రామా! దేహభావంతో నీవు ప్రభువు, నేను సేవకుడను. మనోభావముతో నీవు బింబము, నేను ప్రతిబింబమును. ఆత్మభావంతో నీవేనేను, నేనేనీవు' అన్నాడు.

**ఆవలింత చిటికలు**

హనుమంతుడు అమాయకుడు! అంటే మాయ లేనివాడు. ఏ కుటిలోపాయము ఎరుగని సత్యపరాక్రముడు. ఆయన భక్తి మహాపవిత్ర భక్తి. ఏకార్యము చేసినా విజయమే సాధించును. పట్టాభిషేకమైన తరువాత సీత, భరతుడు, శత్రుఘ్నుడు, లక్ష్మణుడు అందరూ రాముని సన్నిధిలో కూర్చొని, ఈ హనుమంతుని వలన మాకు రామసేవకు అవకాశమే దొరకటంలేదని, రామచంద్రమూర్తికి ఉదయమునుంచి రాత్రివరకు చేయవలసిన సేవల లిస్టు తయారుచేసి, వాళ్ళే అన్నిటినీ పంచుకొనిరి. తరువాత, హనుమంతుడు వచ్చినప్పుడు, 'మీకు యే సేవా కార్యము మిగలలేదు. రేపటినుండి మీకు రామ సేవ చేయుటకు వీలులేదు' అని చెప్పిరి. హనుమంతునికి చాలా దుఃఖమాయెను. మీ లిస్టు ప్రకారము అన్నిటినీ పంచిపెట్టి పూర్తి అయిన తరువాత, ఏదైనా

మిగిలియుంటే, నేను ఆ కైంకర్యమును తీసుకోవచ్చునా' అని వేడుకొన్నాడు. వారందరూ చక్కగా యోచనచేసి, ఏకమై సంప్రదించి, 'సరే! మిగిలిన సేవను నువ్వు చేయవచ్చును' అని లిస్టుని హనుమంతుని చేతికిచ్చిరి. కొండంత ఆశతో అతడు దానిని వేయి కన్నులతో పరీక్షించాడు.' ఒక సేవా కార్యమును వారు ఊహించలేదు. ఎవరికీ పంచలేదు. అది తనకు దొరికిన చాలు, కృతార్థుడని తలంచి దానిని తనకు యిమ్మ'ని కోరినాడు. అదేమన్న ఆవలిస్తున్నప్పుడు చిటికలు వేయుట! రామచంద్రప్రభు ఆవలించినప్పుడంతా, హనుమంతుడు చిటికలు వేయవలసినదిగా తీర్మానమైనది. ఇది చాలా చిన్న సేవ. అయితే ఎప్పుడు, ఏ సమయమందు, ఎక్కడ ఆవలింపు వస్తుందో తెలియదు. కాబట్టి, ప్రభువుయొక్క ముఖారవిందమునే అనిమీలిత నేత్రాలతో అవలోకించి, వారి ఎదుటనే సదా సర్వత్ర ఆంజనేయుడు సిద్ధముగా జాగ్రత్తగా వుండవలసి వచ్చినది. సర్వకాలములందు దర్శన భాగ్యము దొరికినది. అదికూడ భగవంతుని అనుగ్రహమే, ఆయనకు తెలియక ఏదియూ జరగదే! భక్తులను పరమాత్మని సన్నిధినుంచి దూరముచేయుట ఎవరి తరమూ కాదని శ్రీరామచంద్రుడు ఈసంఘటన వలన చూపించారు, అంతే.

లంకలో విభీషణుడు హనుమంతుని కల్సుకొని, 'హనుమంతా! నీవెంత అదృష్టవంతుడవోయి. నేను ఎన్నో సంవత్సరములనుండి రామచింతన చేస్తున్నాను. కాని, రామదర్శనం నాకు ప్రాప్తించలేదు' అని చాలా బాధపడ్డాడు. అప్పుడు, 'విభీషణా! తట్టలోనున్న పంచభక్ష్యపరమాన్నముల పేర్లు చెబుతూ కూర్చుంటే నీ ఆకలి తీరుతుందా? అదేవిధంగా నీవు రాముని స్మరించినంత మాత్రమున చాలదు. రామాజ్ఞను శిరసావహించి రామకార్యములో పాల్గొను' అని బోధించాడు. అప్పుడే విభీషణుడు రాముని సన్నిధి చేరి, రామకార్యంలో పాల్గొని రామునికి చేరువయ్యాడు.

**అర్జున గర్వభంగం**

త్రేతాయుగంలో విజయుడనే రాజు వుండేవాడు. చంద్రగోళపురం రాజధానిగా చేసుకొని సామ్రాజ్యం పరిపాలిస్తూ ఉండేవాడు. సత్యం, నీతి, శాంతి సుస్థిరంగా నెలకొల్పి బీదలపట్ల సానుభూతి, దుఃఖితులయెడల దయ ప్రదర్శిస్తూ విస్తారమైన ప్రఖ్యాతి సంపాదించాడు. పొలిమేరలో వున్న రాజ్యాలు ఆక్రమించుకొని సామ్రాజ్యం విస్తరించుకోవాలనే బలీయమైన కోరిక కలిగింది. శాస్త్రనియమాలను అతిక్రమించడనే విశ్వాసంతో ఆయన గురువు గర్గుడు, విజయ ప్రయత్నాలను ఆమోదించాడు. దైవసహాయం సంపాదించే మంత్రమును ఉపదేశించాడు. మంత్రం నేర్చుకొని జపించగానే హనుమంతుడూ, జాంబవంతుడూ, సుగ్రీవుడూ ప్రత్యక్షమైనారు. 'మాకు యేమి ఆజ్ఞ యిస్తారో చెప్పండి' అన్నారు. విజయుడు తనకు నేల నాలుగు మూలలనూ జయించాలనే కాంక్ష కలిగిందనీ, అది తీరేవరకు తనకు విశ్రాంతి లేదనీ చెప్పాడు. హనుమంతడూ, సహచరులూ చెప్పారు, ' ఇది అసంభవం. ఇంటికి వెళ్ళు. ఇది నీకు ద్వాపరయుగంలోనే సాధ్యమౌతుంది. రాజభవనానికి విజయుడు తిరిగి వెళ్ళిపోయాడు. ద్వాపరయుగంలో విజయుడే అర్జునుడుగా జన్మించాడు.

త్రేతాయుగం గడచిపోయింది. ద్వాపరం వచ్చింది. దిగ్విజయయాత్ర చేస్తూ అర్జునుడు దక్షిణదేశం వెళ్ళి రాముడు లంక చేరటానికి నిర్మించిన సేతువును చూసాడు. తన అస్త్రనైపుణ్యం అసమానమని అర్జునుడికి గర్వం. మనస్సులో తాను రామునికంటె గొప్ప అనుకున్నాడు. రాముడు కష్టపడి రాళ్ళతో వంతెన కట్టాడు. 'ఆ పరిస్థితిలో నేను ఉంటే బాణాలతో వంతెన కట్టేవాడిని. బాణాల వంతెనమీద సైన్యం హాయిగా దాటి లంక వెళ్ళేది' అనుకున్నాడు అర్జునుడు. అనుకోగానే నవ్వుతూ హనుమంతుడు ప్రత్యక్షమైనాడు. ఆ నవ్వువల్ల కోతిముఖం మరీ వికృతంగా అర్జునుడికి తోచింది. 'వానరసైన్యం సంగతి వదిలేసి ఒక్క కోతి దాటివెళ్ళటానికి తగిన బాణాల వంతెన కట్టు చూద్దాం' అని హనుమంతుడు సవాలు చేశాడు. అర్జునుడు విల్లు వంచి శరపరంపర విసురుతూ ఒక వంతెన కట్టి భారతదేశానికి లంకకూ మధ్య సేతువు యేర్పరిచాడు. 'ఈ వంతెన తేలికగా కూలిపోతుంది' అన్నాడు హనుమంతుడు. 'నువ్వు దాటుతుండగా ఈ వంతెన కూలిపోతే నేను ప్రాణత్యాగం చేస్తాను' అన్నాడు అర్జునుడు.

అప్పుడు హనుమంతుడు వంతెనమీద కాలు పెట్టాడు. అది ఫెళఫెళా విరిగి ముక్కలైపోయింది.

రామునికంటె తాను గొప్పవాడినని గర్వపడిన పాపానికి పరిహారంగా చేసిన బాస ప్రకారం అర్జునుడు చితి పేర్చుకొని అగ్నిప్రవేశము చేయటానికి సిద్ధపడ్డాడు. అప్పుడు కృష్ణుడు అక్కడకు వచ్చి ఏమీ ఎరగనట్లుగా కారణం ఏమిటని అడిగాడు. అర్జునుడూ హనుమంతుడూ పందెం వేసుకోటం, అందులో అర్జునుడు ఓడిపోవటం విని, 'పందెంలో జయాపజయాలు నిర్ణయించేదానికి సాక్షి వుండాలి పోటీదారుల మాటలు నమ్మటానికి వీలుకాదు. షరతులను ఎవరికి అనుకూలంగా వారు మార్చుకుంటారు. మధ్యవర్తి ఉండాలి' అన్నాడు కృష్ణుడు. కాబట్టి మళ్ళీ వంతెన కట్టమన్నాడు. హనుమంతుని యింకొకసారి దాటమన్నాడు. అర్జునుడు మళ్ళీ వంతెన కట్టినాడు. హనుమంతుడు ఎంత ప్రయత్నించినా వంతెన చెక్కుచెదరలేదు. హనుమంతుడు దానిమీద గంతులు వేశాడు. కాని అది కొంచెమైనా చెడిపోలేదు. దాని రహస్యం యిది. దేవాసురులు క్షీరసాగరం మథించిన సమయంలో మందరగిరిని ధరించిన వీపుతో కృష్ణుడు బాణాల వంతెనను మోపుచేసి హనుమంతుడు అడుగు వేసినప్పుడు ఆదుకున్నాడు. ఈ రహస్యం హనుమంతుడు, అర్జునుడు కృష్ణుని వీపుకు కారుతున్న నెత్తురుచూసి తెలుసుకోగలిగారు. తన భక్తుని పరువు నిలబెట్టటం కోసం భగవంతుడు ఆదుకొని అడ్డుపడ్డాడు.

అర్జునునికి గర్వభంగం జరిగింది. హనుమంతుని పాదాలమీద పడి యుద్ధభూమిలో శత్రువులను ఓడించటంలో తనకు సాయం చేయమని వేడుకున్నాడు. తన శక్తిముందు కౌరవబలం అత్యల్పమనీ తనకు సాటిరానివాళ్ళతో పోరాడటం అధర్మమని ఆంజనేయుడు బదులు చెప్పాడు. చివరికి హనుమంతుడు అర్జునుని రథంపైన ఎగిరే జెండా మీద వుంటూ తన తేజస్సును ఆ వీరుడిమీద ప్రసరించటానికి అంగీకరించాడు. ఈవిధంగా త్రేతాయుగంనాటి కోరిక నెరవేరింది. త్రేతాయుగంలో గర్గునిచేత ఉపదేశించబడిన మంత్రం సఫలమైంది.

ఈ దేహానికి ఏడవ సంవత్సరం. మాఘమాసం ప్రారంభమైంది. నేను పిల్లలతో, 'మాఘస్నానం చాలా పవిత్రమైనది. అయితే, కేవలం స్నానం చేసినంత మాత్రాన చాలదు. మీరు దైవ ప్రదక్షిణకూడా చేయాలి' అని చెప్పాను. తెల్లవారుఝామున నాల్గుగంటలకే మేము ఆంజనేయస్వామి గుడికి వెళ్ళేవారము. అక్కడొక పెద్ద కొలను ఉండేది. చిన్నచిన్న పిల్లలు మాత్రం ఎంత లేపినా లేవలేకపోయేవారు పాపం! అలాంటి పిల్లవానిని నేను ఎత్తుకొనిపోయి స్నానం చేయించేవాడిని. అందరం కలసి గుడికి వెళ్ళాము. 'ఆంజనేయస్వామికి మీరు ప్రదక్షిణాలు చేసుకొని రండి. నేనిక్కడే ఉంటాను' అని చెప్పాను. వారు ప్రదక్షిణాలు చేయటానికి వెళ్ళారు. కాని, వారిలోవారు, 'రాజుకూడా మనతో ఎందుకు రాకూడదు? రాజు మనకు ఎన్నో పనులు నేర్పించాడు. అతను లేకుండా మనం ఏపనీ చేయలేం. కాబట్టి, అతను ముందు నడవాలి, మనం వెనుక నడవాలి' అనుకున్నారు. వెంటనే అందరూ నా దగ్గరకు పరుగెత్తుకొని వచ్చారు. 'రాజూ! నీవు కూడా మాతో పాటు రావాలి' అన్నారు. 'నేను వస్తాను. మీరు ముందు ప్రదక్షణలు చేసుకొని రండి' అన్నాను. 'నీవు వస్తేకాని మేము పోము' అని మొండికెత్తారు. 'నాకు కాళ్ళు నొప్పిగా ఉన్నాయి' అన్నాను. 'మేము ఎత్తుకొని తీసుకు వెడతాము' అన్నారు. ఈవిధంగా, వారు ఎంతో ప్రేమతో బలవంతం చేయటం చేత నేను కూడా ఆంజనేయస్వామి గుడికి వెళ్లి ప్రదక్షిణ చేయటానికి ఉపక్రమించాను. మీరు నమ్మవచ్చు, నమ్మకపోవచ్చుగాని, ఒక పెద్ద కోతి నాకు అడ్డు నిలుచుంది. ఈ పిల్లలందరు, 'ఇంత పెద్దకోతిని మేము ఈ ఊర్లో ఎప్పుడూ చూడలేదే! ఇది ఎక్కడనుండి వచ్చింది?' అని ఆశ్చర్యపోయారు. దానిని తరిమి వేయటానికి ఎంతో ప్రయత్నం చేసారు. కాని, అది కదల్లేదు. ఆ కోతి ఎవరు? సాక్షాత్తు హనుమంతుడే! వారికి తెలియదు. హనుమంతుడు వచ్చాడు. 'స్వామీ! నేను మీకు ప్రదక్షిణ చేయవలసినవాడను. మీరు నాకు చేయకూడదు' అన్నాడు. సరే, నేను పిల్లలకు చెప్పాను, 'నేను ప్రదక్షిణ చేయటం హనుమంతునికి యిష్టం లేదు. కాబట్టి, నేను మానేస్తాను' అన్నాను. ఆనాటినుండి పిల్లలో చాలా పరివర్తన కలిగింది. వారిలో దివ్యమైన భావాలు కలిగాయి. వాళ్ళు ఇళ్ళకు తిరిగి వెళ్ళేటప్పుడు, 'రాజు మాతో కలసి హనుమంతుని గుడికి ప్రదక్షిణ చేస్తుంటే ఒక పెద్ద కోతి అడ్డుగా వచ్చి అతనిని ప్రదక్షిణ చేయనివ్వలేదు' అని అందరితో చెప్పారు.